క్లుప్తంగా

మెటీరియల్ పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి నైపుణ్యం గల శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక ప్రాథమిక కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో శిక్షణార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. తదుపరి నైపుణ్య శిక్షణ కేంద్రంలో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వందమందికి సుమారు రూ.20 వేలు విలువైన మెటీరియల్‌ను స్వర్ణాంధ్ర తరపున ఉచితంగా అందించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ మహిళలకు కుట్టుశిక్షణతో పాటు, మగ్గంవర్క్, బ్యూటీషియన్, కంప్యూటర్‌లో కూడా శిక్షణ అందిస్తున్నామన్నారు. ఆసక్తి గల మహిళలు నేరుగా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం టీచర్లు దుర్గాదేవి, ఉషారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన నగర అధ్యకుడిగా రామకృష్ణ



రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడిగా పీతా మురళీ రామకృష్ణ నియమితులయ్యారు. ఈ విషయాన్ని పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శుక్రవారం తన కార్యాలయంలో ప్రకటించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్న రామకృష్ణ.. కరోనా సమయంలో సూపర్ – 60 బృందంలో ఎంతో కీలక సేవలు అందించారన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ శిష్యుడిగా పార్టీ పటిష్టతకు, అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి రామకృష్ణ చేసిన సేవలను గుర్తించి, అధిష్టానం ఆదేశాల మేరకు అతడిని యువజన విభాగం నగర అధ్యక్షుడిగా రీజినల్ కోఆర్డినేటర్లు మిథున్ రెడ్డి, పిల్లి సుభాస్ చంద్రబోస్ నియమించారన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో జరుగుతున్న ఒనువులమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉత్సవమూర్తుల గ్రామ ప్రదక్షిణం వేడుకగా జరిగింది. ఉదయం ఉత్సవ మూర్తులకు వాస్తు పూజ, క్షీరాభిషేకం నిర్వహించారు. శనివారం ఉదయం 10.18 గంటలకు అమ్మవారి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

త్వరగా ప్రజాజీవితంలోకి రావాలి



జక్కంపూడి విజయలక్ష్మితో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతురాలై, ప్రజా జీవితంలోకి రావాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆకాంక్షించారు. శుక్రవారం రాజమహేంద్రవరం విచ్చేసిన ఆమె.. ప్రకాశం నగర్‌లో జక్కంపూడి విజయలక్ష్మి ఇంటికి వచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స తీసుకుని, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విజయలక్ష్మిని కలుసుకుని ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా రథోత్సవం

కడియం: వీరవరంలోని ఉమారామలింగేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ రథంపై స్వామివారిని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. శుక్రవారం రాత్రి ఆలయ అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో కన్నుల పండుగా కల్యాణోత్సవం జరిపించారు.

బంగారు గొలుసు మాయం

కంబాలచెరువు: స్థానిక భీమా జ్యూయలర్స్‌లో 20 గ్రాముల బంగారు గొలుసు మాయమైందని ఆ షాపు మేనేజర్ షణ్ముఖ్ శుక్రవారం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ షాపులో నగలు చూసేందుకు గురువారం ఒక మహిళ వచ్చింది. అక్కడ సేల్స్‌మేన్‌తో పలు రకాల నగలు చూపించాలని అడిగింది. వాటిలో ఏమీ నచ్చలేదని ఆమె వెళ్లిపోయింది. ఆ తర్వాత 20 గ్రాముల చైన్ కనిపించకుండా పోయింది. దీంతో షాపులో వెతికారు. సీసీ కెమెల ద్వారా జరిగిన చోరీని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆభరణాలు చేస్తామంటూ మోసం

కంబాలచెరువు: పెళ్లికి ఆభరణాలు చేయాలని ఇచ్చిన సొమ్ము, బంగారాన్ని కాజేసిన జ్యూయలరీ దుకాణంపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. స్థానిక శోభానగర్‌కు చెందిన కోటా రాంబాబు తన కుమార్తె పెళ్లికి ఆభరణాలు చేయించేందుకు మెయిన్‌రోడ్డులోని దుర్గా జ్యూయలర్స్‌లో 310 గ్రాముల బంగారం, రూ.10 లక్షలు ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా ఆభరణాలు చేసి ఇవ్వక పోవడంతో పలుమార్లు వెళ్లి దుకాణం యజమాని వరప్రసాద్‌ను అడిగాడు. ఫలితం లేకపోయేసరికి వరప్రసాద్, దానిలో పనిచేసే మరో ముగ్గురిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రోలర్ స్కేటింగ్‌లో చిన్నారుల ప్రతిభ

- వివిధ పోటీల్లో పతకాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు



జాతీయ పతకం సాధించిన భవ్యశ్రీ

ప్రకాశం నగర్: రోలర్ స్కేటింగ్‌లో చిన్నారులు ప్రతిభ చూపుతున్నారు. నగరంలోని గాంధీపురం పార్కులో ఉన్న రోలర్ స్కేటింగ్ గ్రౌండ్‌లో శిక్షణ తీసుకుంటున్న కె.భవ్యశ్రీ ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించగా, రాష్ట్ర స్థాయిలో ఎన్.అనిరుథ్ రాజా, వెంకట కార్తిక్, జి.వీర శ్రీవత్సవ్, జితేంద్ర కుమార స్వామి, సీహెచ్ వర్షిత్, మోక్షశ్రీ, ఐ.జశ్వంత్, రుబిన్ ప్రతిభను కనబరిచారు. కోచ్ కెల్లా రాము శిక్షణలో ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు ఆరు గంటలు శిక్షణ పొందుతున్నారు. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు రోడ్డు మీద స్కేటింగ్‌లో శిక్షణ ఉంటుందని, సాయంత్రం 4 నుంచి 7.30 వరకు స్కేటింగ్ గ్రౌండ్‌లో శిక్షణ ఇస్తున్నారు. గాంధీపురం పార్కులోని రోలర్ స్కేటింగ్ గ్రౌండ్‌తో పాటు, కోరుకొండ రోడ్డులో వీవర్స్ కాలనీ స్కేటింగ్ గ్రౌండ్ చిన్నారులకు అందుబాటులో ఉన్నాయి. సుమారు 50 మంది చిన్నారులు ఈ రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం

స్కేటింగ్‌లో శిక్షణ తీసుకోవడంతో క్రమశిక్షణ ఏర్పడుతుందని, చదువులో ఒత్తిడి తగ్గి జ్ఞాపక శక్తి మెరుగవుతుందని, స్కేటింగ్ చేస్తే చిన్నారులు బరువు తగ్గడంతో పాటు ఆస్తమా వంటి సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే స్కేటింగ్‌పై చిన్నారులు ఇప్పుడు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో మంచి వ్యాయమంగా ఉండడంతో పాటు చిన్నారుల్లో మరింత ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది.

క్రీడాభివృద్ధికి పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో ఇతర జిల్లాలు, రాష్ట్రస్థాయి పోటీలు జరిగినప్పుడు క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సౌకర్యాలు దాతల సహకారంతో నిర్వహించేవారు. ఇప్పుడు క్రీడాకారులకు అవసరమైన ఉదయం అల్పాహారం, భోజనం, వసతి సదుపాయాలను ప్రభుత్వం కల్పించడంతో క్రీడాకారులు, కోచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొనియాడుతున్నారు.

మక్కువ చూపిస్తున్నారు



రోలర్ స్కేటింగ్‌పై చిన్నారులు మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం నగరంలోని రెండు స్కేటింగ్ గ్రౌండ్‌లలో సుమారు 50 మంది శిక్షణ తీసుకుంటున్నారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిచడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడమే ధ్యేయంగా శిక్షణ ఇస్తున్నాను. బెస్ట్ స్కేటింగ్ కోచ్‌గా అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉంది.

– కెల్లా రాము, స్కేటింగ్ కోచ్

పలుకు ఆశ్రమ పాఠశాలకు రూ.లక్ష వితరణ



రూ.లక్ష నగదు అందజేస్తున్న ఆకుల వీర్రాజు దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక స్వరాజ్య నగర్ సంకల్పమ్ సర్వీస్ ఆర్గనైజేషన్ పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, నాగమణి దంపతుల 48వ పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుకు ఆశ్రమ పాఠశాలకు మినీవ్యాన్ కొనుగోలు కోసం రూ.లక్ష నగదును ఆకుల వీర్రాజు దంపతులు పలుకు నిర్వాహకురాలు గంటా కనకదుర్గకు అందించారు. ఆయన మాట్లాడుతూ బధిరులకు కనక దుర్గ దంపతులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆకుల బాపిరాజు, రాజా పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు క్యూ కట్టిన బాధితులు

- ఫిర్యాదుల నమోదు
- విచారణ చేపట్టిన డీఎస్పీ శ్రీలత



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కడియం: స్థానిక జయరామ్ ఎలక్ట్రికల్స్ అధినేత జయరామ్‌కు అప్పులు ఇచ్చిన బాధితులు శుక్రవారం కడియం పోలీస్ స్టేషన్‌కు క్యూ కట్టారు. దాదాపు 35 మంది సుమారు మూడు కోట్ల రూపాయలకు సంబంధించిన ప్రామిసరీ నోట్లు తీసుకుని స్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాధితులతో దక్షిణ మండలం డీఎస్పీ ఎం. శ్రీలత విడివిడిగా మాట్లాడారు. బాధితులు తమ గోడును డీఎస్పీకి వివరించారు. తమ కుటుంబాలు, ఆడబిడ్డల భవిష్యత్తు ఈ డబ్బులతోనే ముడిపడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జయరామ్‌కు సంబంధించిన ఆస్తులను వేరే వారికి రాసేసి ముందు జాగ్రత్త పడ్డాడని తెలిపారు. ఒక వ్యక్తిని నమ్మి ఇంత డబ్బును ఏ విధంగా ఇచ్చారంటూ డీఎస్పీ శ్రీలత వారిని ప్రశ్నించారు. ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద నుంచి నమ్మకంగా అప్పు రూపంలో డబ్బులు సేకరించారని, తీరా తిరిగి ఇవ్వాలనేసరికీ తమపైనే తిరగబడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. డబ్బులు తిరిగి రాకపోతే ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప గత్యంతరం లేదని వాపోయారు. బాధితుల గోడు విన్న డీఎస్పీ ఫిర్యాదు చేస్తే చట్ట రీత్యా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో 35 మంది బాధితులు ప్రామిసరీ నోట్ల కాపీలు, ఫిర్యాదులను పోలీసులకు అందజేశారు. జయరామ్ సోదరుడు శ్రీనివాస్, కుటుంబ సభ్యులతో కూడా డీఎస్పీ శ్రీలత చర్చించారు. వారు తెలిపిన వివరాలను పరిశీలిస్తే రూ.కోట్లలోనే ఈ మొత్తం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ లెక్కన బాధితుల సంఖ్య మరింతగా పెరుగుతుందని పోలీసులు భావిస్తున్నాయి. కాగా.. తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడిగా ఉన్న జయరామ్‌ను కాపాడేందుకు ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. రుణదాతలు తమ డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి పెంచినప్పటి నుంచీ పలువురు టీడీపీ నాయకులు ఈ వ్యవహారంలో మధ్యవర్తుల మాదిరిగా కలుగజేసుకుని బాధితులను న్యాయం చేస్తామంటూ నమ్మబలికారంటున్నారు. ఇలా ఆలస్యం చేసే క్రమంలోనే జయరామ్ తన ఆస్తులను వేరే వారికి సేఫ్‌గా మార్పించి, అప్పులు ఇచ్చిన వారిని నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తున్నాడని బాధితులు చెబుతున్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ధవళేశ్వరం: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దగల సీఐటీయూ కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అమర వీరులకు సంతాపం తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మరోపక్క కార్పొరేట్ కంపెనీలకు, పరిశ్రమల అధిపతులకు దోచిపెడుతున్నారన్నారు. దేశం అంటే ఆదానీ, అంబానీ అన్నట్లుగా మోదీ మార్చేశారని విమర్శించారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో 10 లక్షల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాజులోవ, కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు, ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్ మూర్తి, మాణిక్యాంబ, జిల్లా కార్యదర్శులు కె.బేబీ రాణి, కె.రామకృష్ణ, పి.తులసి పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సుభాషిణి, డీఆర్‌డీఏ పీడీ

రాజమహేంద్రవరం రూరల్: మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న మూడో విడత వైఎస్సార్ ఆసరాపై క్షేత్ర స్థాయి కార్యక్రమాలు నిర్వహించాలని డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్ట్ డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందితో క్షేత్ర స్థాయి కార్యాచరణ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కింద తొలి విడతలో 27,297 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.242 కోట్లు, రెండో విడతలో 27,417 గ్రూపులకు రూ.244 కోట్ల ప్రయోజనం కల్పించారన్నారు. మూడో విడతలో 27,413 మందికి రూ.243 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకువెళ్లే దశలో మార్చి 14 నుంచి 17 వరకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేశామన్నారు. రెండో దశ కార్యాచరణలో గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆర్థిక స్వావలంబన దిశగా దిగ్గజ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలపై అవగాహన కల్పించాలన్నారు. మూడో దశలో మార్చి 21, 22, 24 తేదీల్లో వైఎస్సార్ ఆసరా సమావేశాలు నిర్వహించాలన్నారు.

23 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

కడియం: మాధవరాయుడుపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భువనేశ్వరీ సమేత చంద్ర మౌళీశ్వరస్వామితో పాటు 18 విగ్రహాలకు ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23న కలశ స్థాపన, 27న విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నసమారాధన, పూర్ణాహుతి, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

సమర్థ పాలన అవసరం

ప్రకాశం నగర్: రాష్ట్రంలో సమర్థవంతమైన పరిపాలన అవసరమని టీడీపీ నాయకుడు కాశి నవీన్ కుమార్ అన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను ఉద్దేశించి శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పట్టభద్రులందరూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు.

శాటిలైట్‌సిటీలో రెండు పూరిళ్లు దగ్ధం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

- సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలు
- బాధితులను పరామర్శించిన చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ సచివాలయం –3 పరిధిలోని వినాయకుని గుడి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఐదుగంటల సమయంలో రెండుపూరిళ్లు దగ్ధమయ్యాయి. నెల్లి వరలక్ష్మి, వాడబోయిన పైడితల్లి కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. వాడబోయిన పైడితల్లికి రూ.80వేలు, నెల్లి వరలక్ష్మికి రూ.60 వేల ఆస్తినష్టం సహాయ అగ్ని ప్రమాద అధికారి ఎన్.గోపీకృష్ణ అంచనా వేశారు.

బాధితులకు పరామర్శ

ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ బాధితులను పరామర్శించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వీఆర్వో రామవరపు రత్నకుమారిలను అగ్నిప్రమాద నష్టం, బాధితుల వివరాలను తనకు తెలపాలని ఆదేశించారు. అనంతరం బాధితులకు నిత్యావసర వస్తువులు, నగదు అందించారు. మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్మ శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, బత్తిన అప్పారావు, కాకరపల్లి అప్పారావు, సఫారి నాయుడు, పుచ్చా గోవింద రెడ్డి, రుంకాని రవి, అనురాధ పాల్గొన్నారు.

నైపుణ్యం గల శిక్షణతో ఉత్తమ డ్రైవర్లు



శిక్షణ పొందిన అభ్యర్థులతో ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: క్రమశిక్షణతో కూడిన శిక్షణ ద్వారా ఉత్తమ డ్రైవర్లుగా తయారవుతారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 8వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసిన డ్రైవర్లకుసర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీపీటీఓ షర్మిల అశోక మాట్లాడుతూ 16 మందికి మంచి నైపుణ్యతతో కూడిన డ్రైవింగ్ మెళకువలు నేర్పించామన్నారు. డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 133 మంది శిక్షణ పూర్తి చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పొందారన్నారు. మరి కొన్నిరోజుల్లో 9వ బ్యాచ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బ్యాచ్ వివరాలకు అభ్యర్థులు 73821 12678 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయబాబు, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) ఈశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఎల్ రావు పాల్గొన్నారు.

సంక్షేమవారధులుగా గృహసారథులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో గృహసారథులు పార్టీ సంక్షేమానికి వారధిగా నిలవాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పిలుపు నిచ్చారు. 44వ డివిజన్ ఇన్‌చార్జి బూరాడ భవానీ శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలు ప్రతి కుటుంబానికి చేరాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు పోలు విజయలక్ష్మి, కొత్త బాల మురళీకృష్ణ, గణేష్, పవన్, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీస్థలాల పన్నుపై వడ్డీ మాఫీ



దినేష్‌కుమార్, ఇన్‌చార్జి జేసీ, కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక, పురపాలక సంఘాల పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, పన్నుపై విధించిన వడ్డీని మాఫీచేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్ టైమ్ విధానంలో చెల్లించే విధంగా ప్రకటించిందన్నారు. బకాయిఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి ఈనెల 31వ తేదీలోపు చెల్లిస్తే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నులను నేరుగా సంబంధిత సచివాలయంలో, ఆన్‌లైన్‌లో, నెట్‌బ్యాంకింగ్ ద్వారా, డెబిట్ / క్రెడిట్ కార్డుల ద్వారా, యూపీఐ ద్వారా చెల్లించవచ్చన్నారు.

నలుగురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రెండు వాహనాల్లో ఎద్దులు, ఆవులను తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. దివాన్‌చెరువు జీరోపాయింట్ వద్ద ఎస్సై జగన్‌మోహన్, సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా రెండు వాహనాల్లో విజయనగరం నుంచి గుంటూరు తరలిస్తున్న తొమ్మిది ఎద్దులు, నాలుగు ఆవులను గుర్తించారు. ఆ వాహనాలకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నలుగురిని అరెస్టు చేశారు. ఎద్దులను, ఆవులను సంరక్షణ కోసం గోకవరంలోని గోశాలకు తరలించారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీఅండ్‌బీసీ) చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక చందన గార్డెన్స్‌లోని రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామాలలో పెండింగ్‌లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులను సైతం వేగవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో రౌడీషీటర్ సాయి మృతి



కాతా సాయి (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: దివాన్ చెరువు సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మూరు నేతాజీ నగర్‌కు చెందిన రౌడీషీటర్ కాతా సాయి (28) మృతి చెందగా, అతడి స్నేహితుడు కొమ్మ సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మూరు నేతాజీనగర్ 10వ వీధికి చెందిన కాతా సాయి(28), ఆల్కాట్‌తోట ప్రాంతానికి చెందిన కొమ్మ సురేష్ ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి రాజానగరం వెళ్లారు. తిరిగి బొమ్మూరు వస్తుండగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో దివాన్ చెరువు అటవీశాఖ కార్యాలయం సమీపంలో నేషనల్ హైవే మరమ్మతుల జరుగుతుండడంతో ఏర్పాటు చేసిన కోన్స్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో కాతా సాయి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన కొమ్మ రాజేష్‌ను ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కాతా సాయిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని, అలాగే నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 13 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి పల్లకీ ఊరేగింపు



వేంకటేశ్వరస్వామి పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటేశ్వర నగర్‌లోని భూసమేత వేంకటేశ్వరస్వామి వారి 11వ ఏకాదశ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం పల్లకీ ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. కేశవరానికి చెందిన గండిపోతురాజు కోలాటం భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం, శాటిలైట్ సిటీకి చెందిన రామదండు వేషధారణతో పాటు బాణసంచా కాల్పులతో బొమ్మూరు, హుకుంపేట వీధులలో వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ప్రముఖ న్యాయవాది, గొందేశి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో స్వామివారికి విశేష పూర్ణాభిషేకం, సుదర్శన హోమం, మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు టీటీడీ ఆగమ సలహాదారులు ఖండవిల్లి రాధాకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు అంగర పల్లికాంతాచార్యులు, తొమ్మిది మంది రుత్వికలతో నిర్వహిస్తామన్నారు.